# సర్పంచ్ పీఠం దక్కకపోతేనేం



- ఉప సర్పంచి పదవి ఉందిగా

**టి మీడియా, నవంబర్ 29 , హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో స్థానిక సంస్థల హడావిడి మొదలైపోయింది. ఎవరి వ్యూహాల్లో వారు నిమగ్నమై ఉన్నారు. అయితే ఎన్నికలో రిజర్వేషన్లు అనుకూలంగా రానిచోట్ల నాయకులు వ్యూహం మార్చారు. సర్పంచి కాకపోయినా చెక్? పవర్? ఉన్న ఉప సర్పంచి పదవిని దక్కించుకొని ఊరిని ఏలుదామని పథకాలు రచించుకుంటున్నారు. ఆయా రిజర్వేషన్లకు చెంది వెంట ఉండేవారు, చెప్పిన మాట వినే అనుచరుడు, లేదంటే అతడి సతీమణిని సర్పంచిగా బరిలోకి దింపి గెలిపించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సర్పంచి నుంచి వార్డు సభ్యుల వరకు అనువైన వారిని ఎంపిక చేసేందుకు నేతలు రాత్రింబవళ్లు సమాలోచనలు చేస్తూ తలమునకలు అవుతున్నారు.

**ఆర్థికంగా అండగా :** సర్పంచి, వార్డు సభ్యులుగా గెలవాలన్నా, ఉప సర్పంచిగా ఎన్నుకోవాలన్నా డబ్బే ప్రధాన బలం. ఒక్కో గ్రామంలో ఒకలా ఖర్చు అవుతుంది. పట్టణ ప్రాంతానికి దరిదాపుల్లోని గ్రామాల్లో రూ.50 లక్షలకు పైగా, మండలాలకు దూరంలోని పల్లెల్లో కనీసం రూ.10 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని ఆశావహులు అంటున్నారు. ఈ నేపథ్యంలో అంత ఖర్చు పెట్టుకోలేని వారికి ఆయా నాయకులు, ఉప సర్పంచి అభ్యర్థులు ఆర్థికంగా అండగా నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. గెలిచాక పనులు అప్పగించాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

**వార్డు సభ్యుల ఎంపిక కీలకం :** ఉప సర్పంచి బరిలో ఉండే నాయకుడు వార్డుల్లో నిలిపేందుకు గెలిచేవారిని, ప్రధాన అనుచరులను ఎంపిక చేసుకుంటున్నారు. ఉప సర్పంచి కావాలంటే వార్డు సభ్యులే కీలకం కానున్నారు. దీంతో చెప్పిన మాట వినేవారితోనే నామినేషన్? వేయించేందుకు సిద్ధం అయ్యారు. వారికి అవసరమైన నామపత్రాలు, పన్నుల చెల్లింపు, ధ్రువపత్రాలు తీసుకోవడం వంటి పనులన్నీ ఆ నాయకులే చూసుకుంటున్నారు.

**కొన్ని సంఘటనలు :** బషీరాబాద్ మండలంలోని ఓ గ్రామంలో పార్టీ ప్రధాన నాయకుడు సర్పంచి అవుదామని భావించి అన్ని ఏర్పాట్లను చేసుకున్నాడు. తీరా సర్పంచి పదవి బీసీకి రిజర్వు కావడంతో ఉప సర్పంచి పదవిపై కన్నేశాడు. తనకు అనుకూలమైన ఒక వార్డులో నామినేషన్? వేయడానికి సిద్ధమయ్యాడు. ఉప సర్పంచి పదవికి అందరితో ఒప్పందం కూడా చేసుకున్నాడు. పెద్దేముల్ మండలంలోని మరో గ్రామంలో ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో నిత్యం వెంట తిరిగే కార్యకర్త సతీమణిని సర్పంచిగా గెలిపించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడో నాయకుడు. ఆయన ఓ వార్డు నుంచి బరిలో నిలిచి, ఉప సర్పంచి పదవిని చేపట్టి అన్నీ చూసుకునేందుకు వ్యూహం రచించాడు. ఇప్పుడు చాలా గ్రామాల్లో ఇదే తంతు నడుస్తోంది.

### పంచాయతీ ఎన్నికలు

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్? మంగళవారం విడుదలైన విషయం తెలిసిందే. మొత్తం 12,728 సర్పంచి స్థానాలకు, 1,12,242 వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 11, 14, 17 తేదీల్లో పోలింగ్? నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఇప్పటికే మొదటి విడత నామినేషన్ల పర్వం కొనసాగుతుండగా, మరికొద్ది గంటల్లో గడువు ముగియనుంది. ప్రచారానికి కేవలం వారం రోజులు మాత్రమే సమయం ఉంది. దీంతో అభ్యర్థులు ప్రచారానికి పోటాపోటీగా వ్యూహాలు రచించుకుంటున్నారు.



## శ్రీవాణి హై స్కూల్‌కు బెస్ట్ ఇన్స్పైర్ అవార్డు

**టీ మీడియా ,నవంబర్ 29, ఆత్మకూరు:**

వనపర్తి జిల్లాకేంద్రంలో చిట్యాల ఎంజేపీ గురుకుల పాఠశాలలో నిన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా ప్రారంభమైన 53వ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన శ్రీవాణి హై స్కూల్ విద్యార్థులు ఇన్స్పైర్ అవార్డ్స్ 2025కు ఎంపికై బాల వైజ్ఞానిక ప్రదర్శనలో వారి రెండు ప్రాజెక్టులను ప్రదర్శించడం జరిగినది. పాఠశాల నుండి శ్రీవాణి హై స్కూల్ విద్యార్థులు దాదాపు రెండు వందల మంది విద్యార్థులు నేడు ఈ ప్రదర్శన చూడడానికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో కలిసి వైజ్ఞానిక ప్రదర్శనకు వెళ్ళారు. ఈ సందర్భంగా ఇన్స్పైర్ అవార్డుకు సెలెక్ట్ అయినందుకు మరియు తమ పాఠశాల ప్రాజెక్టులు, విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నందుకు పాఠశాల విద్యార్థులను అభినందించిన వనపర్తి జిల్లా విద్యాధికారి డిఈఓ అబ్దుల్ ఘని. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ సాంకేతికపరంగా రోజురోజుకు అనేక మార్పులు వస్తున్నాయని,విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానాన్ని అందించి వారి సృజనాత్మకతకు పదును పెట్టాలని ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో విద్యార్థులను పాల్గొనేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనిన శ్రీవాణి హై స్కూల్ విద్యార్థులను అభినందించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులతోపాటు పాఠశాల ప్రిన్సిపల్స్ లతా, గంగాధర్ ఉపాధ్యాయులు తెలుగు తిరుమలేష్, రుచి మేడం వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3.5 కోట్లు దోపిడీ

- ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు

**టి మీడియా, నవంబర్ 29 , కర్నూలు :**



ఆరోగ్యం బాగు చేయాలని తనను ఆశ్రయించిన దంపతులను క్షుద్రపూజల పేరుతో భయపెట్టి ఏకంగా రూ.3.50 కోట్లు కొట్టేశాడో నకిలీ గురువు. ఈ ఘటన కర్నూలు జిల్లా ఆదోని మండలం బైచిగేరిలో చోటు చేసుకుంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథినిర్వహించిన ప్రజాదర్బార్‌లో బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు.తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరులో ఉంటున్న వెంకటయ్య, పద్మ దంపతులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బైచిగేరి గ్రామానికి చెందిన దుర్గాసింగ్‌కు దేవుడు వస్తాడని, అక్కడికి వెళ్తే ఆరోగ్యం కుదుట పడుతుందని ఎవరో చెబితే కొన్ని రోజుల కిందట దంపతులు అక్కడికి వెళ్లారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దుర్గాసింగ్ వారికి కట్టుకథలు చెప్పారు.

**ఐదు సార్లు దిల్లీకి**

మీ పొలంలో నిధి ఉందని, అది తీసేంత వరకూ మీకు, మీ పిల్లలకు ప్రాణహాని ఉంటుందని భయపెట్టాడు. ఆ నిధి తీస్తానని చెప్పి వారి నుంచి రూ.80 లక్షలు కాజేశాడు. ఓ రోజు రాత్రి బాధితుల స్వగ్రామమైన ఉండవల్లి శివారులోని వారి పొలంలో క్షుద్రపూజలు చేశాడు. అనంతరం ఇక్కడ అమ్మవారి విగ్రహం బయటపడిందని చెప్పి మూడడుగుల ఎత్తున్న విగ్రహాన్ని దంపతులకు చూపించాడు. ఈ విగ్రహాన్ని ఇంట్లో పెట్టుకుంటే ప్రాణహాని ఉంటుందని, అమ్మేస్తే రూ.కోట్లు వస్తాయని నమ్మబలికాడు. విగ్రహం కొనుగోలుకు విదేశాల నుంచి కొందరు దిల్లీకి వచ్చారని చెప్పి, ఐదు సార్లు బాధితులను దిల్లీకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వారి నుంచి సుమారు రూ.3.50 కోట్లు వసూలు చేశాడు. చివరికి మోసపోయామని గ్రహించిన దంపతులు తమ డబ్బు తిరిగివ్వాలని దుర్గాసింగ్‌ను కోరారు.దాంతో అతడు బెదిరింపులకు దిగాడు. గ్రామంలోకి అడుగు పెడితే చంపేస్తామని దుర్గాసింగ్‌తో పాటు ముకుంద అనే వ్యక్తి మమ్మల్ని బెదిరించారని బాధితులు వాపోతున్నారు. దీనిపై పెబ్బేరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, గత నెల ఆదోనికి వచ్చి డీఎస్పీతో పాటు తాలూకా పోలీసు సీఐకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని దంపతులు ఎమ్మెల్యే వద్ద బోరున విలపించారు. ఎమ్మెల్యే ఆదోని డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడగా, సాక్ష్యాలు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని డీఎస్పీ తెలిపారు.

**మూడు అడుగుల లక్ష్మీ విగ్రహం**

తెలంగాణలోని పెబ్బేరు ప్రాంతానికి చెందిన వెంకటయ్య, పద్మ దంపతులు తమ ఆరోగ్యం మెరుగుపరుస్తానని నమ్మించి, కర్నూలు జిల్లా ఆదోని మండలం బైచిగేరి గ్రామానికి చెందిన దుర్గా సింగ్ క్షుద్ర పూజల పేరుతో తమను మూడున్నర కోట్ల రూపాయలు మోసం చేశాడని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. దుర్గా సింగ్ తమ పొలంలో పూజలు చేయాలని నమ్మించి, అక్కడ మూడు అడుగుల లక్ష్మీ విగ్రహాన్ని బయటకు తీశాడని, పూజలు చేయకపోతే తమకు హాని జరుగుతుందని భయపెట్టడంతో తాము విడతలవారీగా డబ్బు చెల్లించామని దంపతులు వాపోయారు.విగ్రహం అమ్మేసి డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి ఐదుసార్లు ఢిల్లీకి తీసుకెళ్లాడని ఆరోపించారు. చివరకు మోసపోయామని గ్రహించి డబ్బు తిరిగి అడగగా, దుర్గా సింగ్, ముకుంద అనే వ్యక్తి 'గ్రామంలోకి అడుగుపెడితే చంపేస్తామని' బెదిరించారని దంపతులు తెలిపారు. దీనిపై పెబ్బేరు, ఆదోని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. సాక్ష్యాలు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని డీఎస్పీ ఎమ్మెల్యేకు ఫోన్‌లో వివరించారు.

## అయ్యప్ప దీక్షపరులకు నిత్య అన్నదానం

**టీ మీడియా, నవంబర్ 29, సుల్తానాబాద్:**



పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రి నగర్ అయ్యప్ప ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిరి పద్మ-మహేందర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదహా రేళు ్గా, అయ్యప్ప దీక్ష పరులకు, నిత్యా అన్నదానం, చేస్తున్న, ఆలయ ట్రస్ట్. చైర్మన్, సాయి పద్మబిమహేందర్, దంపతులను అభినందించారు. ముందు ముందు ఆలయ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అయ్యప్ప దీక్షపరులు ప్రతిరోజు మంచి నియమాలతో ఉండాలని, స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని, కోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో వేద పండితులు రమేష్ శర్మ, గురు స్వామి మిట్టపల్లి మురలీధర్, కాంగ్రెస్ నాయకులు ముత్యాల రవీందర్, జైపాల్ రెడ్డి, నగునూరి అశోక్, కందునూరి ప్రకాష్, ఉస్తేం గణేష్, అమిరిశెట్టి తిరుపతి, కుమార్ కిషోర్, తిరుపతిరావు, ఎల్లె రాజు, శెట్టి శీను తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్

**టీ మీడియా, నవంబర్ 29,మేడ్చల్:**



మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్షా దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఏమ్మెల్యే మల్లారెడ్డి , ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద , మాధవరం కృష్ణా రావు, బండారి లక్ష్మా రెడ్డి , మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు , మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ జిల్లా తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## చెక్ డ్యామ్ పేల్చివేతపై విచారణ జరపాలి

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ రెడ్డి

**టీ మీడియా, నవంబర్ 29, పెద్దపల్లి:**



ప్రకృతి వనరులను దోచుకోవడంలో గత బిఆర్ఎస్ పార్టీ అవలంభించిన విధ్వంస రచనను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మానేరు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు అంబటి కరుణాకర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాములో మానేరువాగులో జరుగుతున్న అక్రమ ఇసుకదందాకు వ్యతిరేకంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ న్యాయస్థానంలో పోరాటం చేశామని, తమవాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం సంబంధిత అధికారులకు రూ.50కోట్ల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని తెలిపారు. ప్రస్తుతం కేసు సుప్రీంకోర్టులో పెండింగులో ఉందని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇసుకదోపిడి మరింత పెరిగిందని విమర్శించారు.గుంపుల వద్ద చెక్ డ్యాం పేల్చివేసిన వారినెవ్వరినీ వదిలిపెట్టబోమని, న్యాయస్థానంలో దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. చెక్ డ్యాం పేల్చివేతపై న్యాయవిచారణ జరిపించడానికి ఎమ్మెల్యే విజయరమణారావు ఎందుకు వెనకాడుతున్నారని ప్రశ్నించారు.

## కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**టీ మీడియా, నవంబర్29, ఆత్మకూర్:**




తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి 16 ఏండ్లు అయిన సందర్భంగా దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా నేడు మక్తల్ నియోజకవర్గం బి.ఆర్.ఎస్వీ ఆధ్వర్యంలో స్థానిక ఆత్మకూరు లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మన నాయకులు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ పాల్గొని కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మండల, మున్సిపల్ బి.ఆర్.యెస్ నాయకులు, బి.ఆర్.ఎస్వీ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 20 లక్షల నిధులు ఇస్తా

- మంత్రి శ్రీహరి ప్రకటన

**టీ మీడియా ,నవంబర్ 29, ఆత్మకూరు :**



వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని 14 గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అనుకూల అభ్యర్థులను ఏకగ్రీవంగా చేస్తే తన సొంత నిధులలో నుండి ఏకగ్రీవం అయ్యే గ్రామాలకు 20 లక్షల నిధులు అందులో అందిస్తానని అమరచింత మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సన్నాక సమావేశానికి హాజరై మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ కార్యక్రమంలో అమరచింత మండలం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన ఎన్నికల సందడి

- మూడో విడత ఎలక్షన్‌కు నామినేషన్ కేంద్రాలు

**టీ మీడియా, నవంబర్ 29 , పెద్దపల్లి బ్యూరో :**



రెండేండ్ల కాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదిరి చూస్తున్న సర్పంచ్‌ల ఎన్నికల సందడి పెద్దపల్లిలో మొదలైంది. ఈ మేరకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో మొదటి దశ ఎన్నికల ప్రక్రియ నడుస్తుండడంతో మూడో దశలో జరుగనున్న పెద్దపల్లి మండలంలోని 30 గ్రామపంచాయతీలలో సర్పంచ్ స్థానాలకు 294 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

**సర్పంచ్ , వార్డు స్థానాల రిజర్వేషన్ లు ఇలా**

పెద్దపల్లి మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ స్థానాల్లో 8 జనరల్, 7 జనరల్ మహిళ, 5 బీసీ జనరల్, 4 బీసీ మహిళ, 3 ఎస్సీ జనరల్, 3 ఎస్సీ మహిళ చొప్పున రిజర్వ్ చేశారు. అలాగే జనరల్ 84, జనరల్ మహిళ 63, బీసీ జనరల్ 38 బీసీ మహిళ 37, ఎస్సీ జనరల్ 28 ఎస్సీ మహిళ 27, ఎస్టీ జనరల్ 1 ఎస్టీ మహిళ 1 చొప్పున మొత్తం 294 వార్డులకు నామినేషన్ ల పర్వం మూడో దశలో ప్రారంభం కానుంది. ఎన్నికలకు అధికారులు సిద్ధం చేసి పెట్టారు.

**అభ్యర్థులు నామినేషన్ వేసే కేంద్రాలు ఇక్కడనే**

30 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు నామినేషన్ లు వేసేందుకు వీలుగా ఎక్కడికక్కడే గ్రామాల దూరాన్ని పరిగణనలోకి తీసుకుని నామినేషన్ లకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా 12 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అప్పన్నపేట నామినేషన్ కేంద్రంలో ( అప్పన్నపేట), చీకురాయి రైతు వేదిక నామినేషన్ కేంద్రంలో (భోజన్నపేట, చీకురాయి,) బొంపల్లి నామినేషన్ కేంద్రంలో (బొంపల్లి, కనగర్తి, కాపులపల్లి), ముత్తారం నామినేషన్ కేంద్రంలో (గౌరెడ్డిపేట, హన్మంతునిపేట, ముత్తారం), కాసులపల్లి నామినేషన్ కేంద్రంలో (కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం), కొత్తపల్లి నామినేషన్ కేంద్రంలో (కొత్తపల్లి, మూలసాల), రాంపల్లి రైతువేదిక నామినేషన్ కేంద్రంలో (మారెడుగొండ, గుర్రాంపల్లి, రాంపల్లి), పెద్దపకల్వల నామినేషన్ కేంద్రంలో (పెద్దకల్వల,పెద్దబొంకూర్ , నిమ్మనపల్లి), రాఘువాపూర్ రైతువేదిక నామినేషన్ కేంద్రంలో (రాఘువాపూర్ , అందుగులపల్లి) , బ్రాహ్మణపల్లి రైతువేదిక నామినేషన్ కేంద్రంలో (రాగినేడు, కుర్మపల్లి, బ్రాహ్మణపల్లి) , రంగాపూర్ నామినేషన్ కేంద్రంలో (సబ్బితం, రంగాపూర్ , దేవునిపల్లి), తుర్కలమద్దికుంట నామినేషన్ కేంద్రంలో తుర్కలమద్దికుంట, నిట్టూరు) గ్రామాల అభ్యర్థులు నామినేషన్ లు వేసేవిధంగా నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, సమీప గ్రామాల అభ్యర్థులు ఆకేంద్రాల్లో తమ నామినేషన్ లు వేయాల్సి ఉంటుందని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ తెలిపారు.

# వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు

## ఆలయం అభివృద్ధి కోసం రూ.146 కోట్లు

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**టీ మీడియా, నవంబర్ 29,కాజీపేట :**



కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రైల్వేకోచ్‌ల తయారీ యూనిట్ కల సాకారం కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. షెడ్యూల్ ప్రకారమే పనులు పూర్తవుతున్నాయని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఆధునిక పద్ధతిలో నిర్మాణాలు జరుగుతున్నాయని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీలు పూర్తి చేస్తున్నామని వివరించారు. వరంగల్‌లో పర్యటించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు.

**కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ**

పీఎం మిత్ర పథకం కింద టెక్స్‌టైల్ పార్క్ చేపడుతున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. వరంగల్ విమానాశ్రయం నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించామని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూమి అప్పగిస్తే త్వరగా నిర్మాణం జరుగుతుందని అన్నారు. వరంగల్ నుంచి ముందుగా ఏటీఆర్ విమానాలు నడపాలని నిర్ణయించామని, కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయని, కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పామని తెలిపారు.

**పత్తి కొనుగోలు కేంద్రాలు పెంచాలి**

అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరు అయ్యాయని, హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరుద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చిందని చెప్పారు. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. కబ్జాలకు గురవుతున్న వరంగల్ ఖిల్లా భూములను రక్షించాలని కోరారు. పత్తి కొనుగోళ్లపై సీసీఐ అధికారులతో చర్చించామని, గత సంవత్సరం 41 లక్షల పత్తి బేళ్లను సీసీఐ కొనుగోలు చేసిందని, గత సంవత్సరం కంటే ఈసారి పత్తి కొనుగోలు కేంద్రాలను పెంచామని, పత్తి కొనుగోలు కేంద్రాలు 113 నుంచి 127కు పెంచామని ఆయన వివరించారు.

**'ఛాయ్ పే' చర్చా కార్యక్రమం**

వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం ఉదయం పరిశీలించారు. ఇందుకోసం ఆయన వందేభారత్ ట్రైన్?లో హైదరాబాద్ నుంచి వరంగల్ చేరుకున్నారు. అనంతరం రైల్వేస్టేషన్ క్యాంటీన్?లో 'ఛాయ్ పే' చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. కేంద్రమంత్రికి పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు.



## బిజెపి రూరల్ అధ్యక్షుని సన్మానించిన నాయకులు

**టీ మీడియా, నవంబర్ఆ29,త్మకూరు :**

అమరచింత మండలం రూరల్ బిజెపి అధ్యక్షునీగా ఎన్నికైన కిష్టం పల్లి మల్లారెడ్డిని అమరచింత మండల నాయకులు శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించారు. రూరల్ మండలాలలో బిజెపిని బలోపేతం చేయడానికి తీవ్రంగా కృషి చేస్తానని, బిజెపి నాయకులు కార్యకర్తలు తనకు సహకరించాలని, మరిచింత మండలంలో కొన్ని బీజేపీ సర్పంచ్లు గెలిపించుకుంటామని రూరల్ మండల అధ్యక్షుడు అన్నారు. ఈ కార్యక్రమంలో అమరచింత బిజెపి మండల నాయకులు క్యామ భాస్కర్, ఏం రాజు అనిల్ కుమార్ అర్జున్ కుమార్ రాకేష్ శెట్టి, విజయ్ యాదవ్ దరిద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.



## పదవి విరమణలో పాల్గొన హన్మంత్ రెడ్డి

**టీ మీడియా, నవంబర్ 29,మేడ్చల్:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల బస్ డిపో ఉద్యోగి, సి.ఎచ్.గురునాథ్ రెడ్డి (డి.ఐ) పదవి విరమణ కార్యక్రమం లో పాల్గిని సల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని గురునాథ్ రెడ్డి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు, ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవ రెడ్డి తోటి ఉద్యోగస్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దిత్వా తుపాను ఎఫెక్ట్

## రెడ్ అలర్ట్ జారీ

**టి మీడియా, నవంబర్ 29 , చెనై :** దిత్వా తుపాన్ తమిళనాడును వణికిస్తోంది. చాలాప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటమే కాకుండా పెద్దఎత్తున గాలులు వీస్తున్నాయి. దీనితో సహాయక బృందాలను అప్రమత్తం చేశారు. తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాన్ మరింత బలపడింది. తుపాన్ ప్రభావంతో తమిళనాడువ్యాప్తంగా బలమైన గాలులు వీస్తుండటమే కాకుండా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈ తుపాన్ పుదుచ్చేరి, ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతోంది. రానున్న కొన్ని రోజులపాటు సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని వాతావరణ విభాగం అప్రమత్తం చేసింది. ప్రస్తుతం పుదుచ్చేరికి 300 కి.మీ, చెన్నైకి 400 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటలుగా 7 కి.మీ వేగంతో కదులుతోంది. ఆదివారం తెల్లవారుజామున తీవ్రవాయుగుండంగా తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉంది. తమిళనాడులోని కావేరి డెల్టా జిల్లాలైన తంజావూర్, తిరువరూర్, నాగపట్టణం, మైలాదుతురైలకు రెడ్ అలెర్ట్ జారీచేసింది. తుత్తుకుడిలో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి.



**ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు**

సముద్రంలో అలలు పెద్దఎత్తున ఎగిసిపడుతుండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. నాగపట్టణంలోనూ చేపల వేటకు వెళ్లే ఓడలు, పడవలు ఒడ్డుకే పరిమితమయ్యాయి. రామేశ్వరం వద్ద సముద్రం కల్లోలంగా మారడంతో ధనుష్కోటికి వెళ్లకుండా పర్యటకులను నిలిపివేశారు. పుదుకొట్టైలో భారీవర్షానికి రిజర్వాయర్‌లోకి వరద ప్రవాహం పెరగటం వల్ల నీటికి దిగువకు వదులుతున్నారు. దీంతో జననినగర్ , కలిముత్తులో కాలనీల్లోకి వరదచేరింది. ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉండటంతో అరక్కోణంలో ఎన్?డీఆర్‌ఎఫ్ బలగాలను మోహరించారు. తంజావూరులో కూడా 30మందితో కూడిన బృందాన్ని సిద్ధంగా ఉంచారు.

**విమానాల సర్వీసులు రద్దు**

దిత్వా తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ విభాగం హెచ్చరికతో తమిళనాడు సీఎం ఎం.కె స్టాలిన్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలని తరలించాలని ఆదేశించారు. మరోవైపు ఈ తుపాను కారణంగా పలు జిల్లాల్లో 54 విమానాలు రద్దు చేసినట్లు చెన్నై విమానాశ్రయ అధికారులు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా చెన్నై నుంచి తూత్తుకుడి, మధురై, తిరుచ్చికి వెళ్లే 16 విమానాలను రద్దు చేశారు. అదేవిధంగా, తూత్తుకుడి, తిరుచ్చి, మధురై నుండి చెన్నైకి వెళ్లే 16 విమానాలను కూడా రద్దు చేశారు. అదనంగా, మధురై, తిరుచ్చి, పుదుచ్చేరి నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లే 22 విమానాలను నిలిపివేశారు.తపాను కారణంగా కడలూర్ జిల్లాలో లక్ష మందికి సరిపడ ఆహారం, ఆశ్రయం కల్పించడానికి తమిళనాడు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయం మంత్రి ఎంఆర్?కే పన్నీర్ సెల్వం తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల 239 ప్రభావితమయ్యే ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. . జిల్లాలో ఉన్న 925 మంది గర్భిణీలకు సకాలంలో వైద్య సాయం అందేలా చర్యలు తీసుకున్టన్లు పేర్కొన్నారు. గాలులు కారణంగా పడిపోయిన చెట్లను వెంటనే తొలగించడానికి సన్నాహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## కాంగ్రెస్, బిఆర్ఎస్ల నుండి బీజేపీ పార్టీలోకి

**టీ మీడియా, నవంబర్ 29, నర్వ :** నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని నర్వ గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వావిళ్ళ వెంకటేశ్వర్ రెడ్డి ,పల్లె రాంరెడ్డి ,లంకాల్ మాజీ బి ఆర్ ఎస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్ శెట్టి,శ్రీపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మన్, పాతర్చేడ్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు రామన్ గౌడ్ హైదరాబాద్ లోని ఎంపీ డీకే అరుణ ఇంట్లో మండల అధ్యక్షుడు అజిత్ సింహ రెడ్డి చొరవతో, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ కాషాయం కండువా కప్పి సాదరంగా అవ్వానించి, కష్టపడి పని చేసే వారికీ మంచి భవిష్యత్ ఉంటుందని దిశా నిర్దేశం చేసారు. ఇట్టి కార్యక్రమంలో ఉండేకోడ్ మాజీ ఎంపీటీసీ పసుల నీరజ్ , నర్వ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మండల్ ప్రధాన కార్యదర్శి విజయ రామ్, బొజ్జన్న, కురుమూర్తి, రామ్ రెడ్డి పాల్గొన్నారు.

## నామినేషన్ల స్క్రూటినీ సిద్ధం చేసుకోండి

- 1న ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, నవంబర్ 29,వనపర్తి :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు నిర్లక్ష్యానికి తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తహసిల్దారులు ఎంపీడీవోలతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న ఐదు మండలాలకు సంబంధించి నామినేషన్ల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ ఒకటో తేదీన అన్ని మండలాల్లో ప్రిసైడింగ్ అధికారులకు ఓటింగ్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన స్థలం, కంప్యూటర్లు, మౌలిక వసతులు సిద్ధం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా డిసెంబర్ 4వ తేదీన ఒ.పి ఒ లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాట్లుచేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొని సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ కు అవసరమైన ఫారం 14, ఫారం 17 శిక్షణ రోజు ఇచ్చే విధంగా చూడాలని సూచించారు. మొదటి విడతలో జరిగే ఎన్నికలకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ డిసెంబర్ 8వ తేదీన, రెండవ విడత వారికి డిసెంబర్ 12, మూడవ విడతకు డిసెంబర్ 14వ తేదీన సంబంధిత మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోల్ అయ్యాక వాటిని స్ట్రాంగ్ రూమ్ లో భద్రం చేసి పోలీస్ కాపలా ఉండే విధంగా ఎతేసుకోవాలని సూచించారు. పోలింగ్ ముందురోజు బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ పోలింగ్ స్టేషన్లకు పంపించే విధంగా మండల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు మండల స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ ఉపసంహరణ చేసుకునే అభ్యర్థుల నుంచి అనెక్సర్ – 1 లో సంతకం తీసుకోవాలని, ఒకవేళ ఒక్కరే అభ్యర్థి పోటీలో మిగిలితే అభ్యర్థి నుండి అనెక్సర్ – 2 తీసుకోవాలని సూచించారు. ఓటరుకు సకాలంలో ఓటర్ స్లిప్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, డబుల్ ఓటర్లు, చనిపోయిన ఓటర్ల జాబితా సిద్ధం చేసి ప్రిసైడింగ్ అధికారికి ముందుగానే అందించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డిపిఓ తరుణ్ చక్రవర్తి, డివిజనల్ పంచాయతీ అధికారి రఘుపతి రెడ్డి, పిడి డిఆర్డీఓ ఉమాదేవి, డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి, ఎలక్షన్ సూపరిండెంట్ మదన్ మోహన్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓ లు తదితరులు పాల్గొన్నారు.






## కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

**ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు..**


**టీ మీడియా, నవంబర్ 29,లక్షెట్టిపేట:** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చిన మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీలోని ఐబీ గెస్ట్ హౌస్ వద్ద లక్షెట్టిపేట్, హాజీపూర్, దండేపల్లి మండలాల 61 సర్పంచ్ అభ్యర్థులను నిర్ణయించినట్లు పాత్రికేయుల సమావేశం మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ... నా ఆరోగ్యం బాగుండాలని ప్రత్యేక పూజలు చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.వైద్యపరమైన సహాయ సహకారాలు అందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో మంచిర్యాల నియోజకవర్గం ఉండేలా ముందుకు సాగుతున్నామన్నారు. అభివృద్ధి ఆకాంక్షించే ప్రజలారా రానున్న సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అందరిని గెలిపించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలుద్దామని తెలిపారు. మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు చదువుతున్న పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను పరిష్కరించాలి

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు**

**టీ మీడియా, నవంబర్ 29,ఆదిలాబాద్:** న్యాయ, పోలీస్, అబ్కారీ, జైలు శాఖల అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన న్యాయ అధికారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జల్ సంచాయి జన్ బాగిదరి విభాగంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, ఎస్పీ, అధికారులు సన్మానించారు.ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ... ముఖ్యంగా దీర్ఘకాలికంగా పెండింగ్ కేసులను, ఫోక్సో, గంజాయి వంటి కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. జిల్లా కోర్టులోని వివిధ విభాగాల్లో అక్టోబర్ మాసాంతానికి 7,310 కేసులు పెండింగ్ లో ఉన్నాయని, 98 కేసులు దీర్ఘాకాలికంగా పెండింగ్ ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 18 భూ సేకరణ కేసుల 66 లక్షల రూపాయలకు సంబంధించిన వివరాలను సీసీఎల్ఏ నుండి ఇరిగేషన్, ఆర్థిక శాఖకు పంపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

ఏజెన్సీ ఏరియాలో సివిల్ సూట్స్ కేసులను శనివారం విచారణ జరపడం జరుగుతుందని, పాత ఏజెన్సీ కేసులను ఆర్డీవో, సబ్ కలెక్టర్ పరిధిలో విచారణకు పంపడం జరుగుతుందని, ఇది ఒక ఆదిలాబాద్ జిల్లాకి పరిమితం ఉందన్నారు. జైలు, అబ్కారీ, డ్రగ్ లకు సంబంధించి లోక్ అదాలత్ పెండింగ్ కెసులను పర్యవేక్షిస్తూ, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు వివేక్ కుమార్, లక్ష్మి కుమారి, సి.ఏం రాజ్యలక్ష్మి, డి.హుస్సేన్, మౌనిక, పోలీస్, జైలు, అబ్కారీ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# బండి ఒకరిది, చలాన్ ఇంకోకరికి

- ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు
- ఇష్టానుసారంగా ట్రాఫిక్ చలాన్ల విధింపు

**టీ మీడియా, నవంబర్ 29,హైదరాబాద్ బ్యూరో:** జనగామకు చెందిన జి. రవి అనే యువకుడు తన హొండా సిటీ ద్విచక్ర వాహనానికి హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తూ మొబైల్? ఫోన్?కు మెసేజ్ పంపారు. అది చూసిన అవాక్కైన ఆ యువకుడు అసలు తాను ఈ నెల 21న హనుమకొండకే వెళ్లలేదని తీవ్రంగా వాపోయాడు. నిజానికి హనుమకొండలో మరో ద్విచక్ర వాహనానికి సంబంధించిన జరిమానాను అక్కడి ట్రాఫిక్ పోలీసులు ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో ఈ సమస్య తలెత్తింది. చేసేది ఏమీ లేక రవి బాధతో జరిమానాను తప్పక చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది ఒకవేళ చెప్పాలంటే దోషిని వదిలేసి నిర్దోషికి శిక్ష వేయడం లాంటిదే. దీనిపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.నర్సంపేటకు చెందిన ఓ యువకుడు హనుమకొండలో ఉద్యోగం చేస్తున్నారు. గత ఆగస్టు నెలలో అతని వాహనానికి చలాన్? విధిస్తూ సెల్?ఫోన్?కు సందేశం వచ్చింది. కామారెడ్డిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించినట్లు చలాన్? వెబ్?సైట్?లో నమోదైంది. కానీ అతడు ఆ రోజు హనుమకొండలోనే ఉండడం ఇక్కడ గమనార్హం. ఫొటోలో వాహనం నంబర్ సరిగ్గా కనిపించక పోలీసులు వివరాలను తప్పుగా నమోదు చేశారు. వేరేవాళ్లకు విధించాల్సిన జరిమానా తనకు విధించడం చూసి ఆ యువకుడు లబోదిబోమన్నాడు.వారిద్దరి మాదిరిగానే పలువురు కార్లు, ద్విచక్ర వాహనాలు కలిగిన వారికి ట్రాఫిక్ చలాన్ల పేరిట జరిమానా విధిస్తూ హైదరాబాద్, వరంగల్‌తో పాటు ఇతర పట్టణాల్లో కూడా ట్రాఫిక్ పోలీసులు ఆన్‌లైన్ సమాచారం మొబైల్? ఫోన్లకు పంపిస్తున్నారు. ఒకసారి జరిమానా వచ్చిందటే ఈ–చలాన్?లో ఎప్పటికైనా చెల్లించాల్సిందే. అసలు తమ తప్పు లేకుండా పోలీసులు జరిమానాలు విధించడం ఏంటని వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సంఘటనలు ఎక్కువే.

**సీటు బెల్టు, హెల్మెట్ పెట్టుకోకుంటే**



హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి నగరాలతో పాటు ఇతర జిల్లాల్లో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిత్యం వాహనాల తనిఖీలు, డ్రంక్? అండ్? డ్రైవ్?లు చేపడుతున్నారు. ఏదైనా కారు వెళ్తున్న క్రమంలో సీటు బెల్టు పెట్టుకోకుంటే, ద్విచక్రవాహనదారులు హెల్మెట్? ధరించకుంటే దూరం నుంచే మొబైల్? ఫోన్?, ట్యాబ్‌లో ఫొటో తీస్తున్నారు. అందులో వాహనాల వివరాలు, వాహనదారుల ఫోటోలు నమోదవుతున్నాయి. అనంతరం సంబంధిత వివరాలను రవాణా శాఖ పోర్టల్‌లో ఆన్‌లైన్ రూపంలో నమోదు చేస్తున్నారు.ఈ క్రమంలో తాము ఫొటో తీసిన వాహనాల నెంబర్లలో ఏదో ఒక నెంబర్ తప్పుగా నమోదు చేయగానే మరో వాహనదారుడికి జరిమానా వెళుతోంది. కేవలం ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు అనేక జిల్లాల్లో చోటుచేసుకుంటున్నాయని విమర్శలు వస్తున్నాయి. చేయని తప్పునకు, ట్రాఫిక్ పోలీసుల ఆన్‌లైన్ తప్పుడు ఎంట్రీకి తాము బలి అవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ–చలాన్? ఫైన్?లు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ముగిసిన తొలివిడత నామినేషన్ల గడువు

### ఉపసంహరణకు డిసెంబర్ 3 తుదిగడువు

**టీ మీడియా, నవంబర్ 29,హైదరాబాద్ బ్యూరో :** పంచాయతీ ఎన్నికలు మొదటి దశకు సంబంధించి నామినేషన్ల గడువు ఇవాళ సాయంత్రం ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్లు స్వీకరించారు. ఆదివారం నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారు. సోమవారం అప్పీళ్ల స్వీకరణ, వచ్చే నెల 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. వచ్చే నెల 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తారు.డిసెంబర్ 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచి ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. రేపటి నుంచి డిసెంబరు 2 వరకు రెండో విడత ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి.



**పోలింగ్ రోజే ఓట్ల లెక్కింపు**

పంచాయతీ ఎన్నికలు 3 విడతల్లో డిసెంబరు 11, 14, 17 తేదీల్లో నిర్వహించేందుకు తెలంగాణ ఎన్నికల సంఘం ఈ నెల 25న షెడ్యూలు విడుదల చేసింది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్, అదే రోజు 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడితో పాటు ఉప సర్పంచి ఎన్నికను సైతం నిర్వహిస్తారు.

**292 వార్డులకు, 32 పంచాయతీలకు ఎన్నికలు లేవు**

న్యాయస్థానాలు వివిధ కేసుల్లో జారీ చేసిన స్టే ఆర్డర్లతో 32 గ్రామపంచాయతీలు, 292 వార్డుల్లో ఎన్నికల నిర్వహణను రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసింది. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 25, కరీంనగర్ జిల్లా వి.సైదాపూర్ మండలంలోని 2, ఖమ్మం జిల్లా ఎన్కూరు మండలంలోని 4 గ్రామ పంచాయతీలను, పెనుబల్లి మండలంలోని ఒక గ్రామ పంచాయతీని ఎన్నికల నోటిఫికేషన్ నుంచి మినహాయించింది.

**ఎన్నికల సంఘానికి ఆదేశాలు**

తెలంగాణ రాష్ట్రంలో 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. వాటికి 2024 సంవత్సరం జనవరిలో పదవీ కాలం పూర్తి అయింది. ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారులకు పాలనా బాధ్యతలు అప్పగించారు. బీసీలకు రిజర్వేషన్లను 42 % పెంపుదలతో సెప్టెంబరు 29న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అక్టోబరు 9న తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులతో ఎన్నికలు నిలిచిపోయాయి. తదుపరి సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎస్టీ, ఎస్సీ, బీసీలకు 50% రిజర్వేషన్ల పరిమితి మేరకే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇచ్చింది. దాంతో తెలంగాణ ఎన్నికల సంఘం ఎన్నికలకు సమాయత్తం అయింది.

**ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేసే అవకాశం**

గ్రామ పంచాయతీల ఎన్నికలను పురస్కరించుకొని ఫిర్యాదులను, అర్జీలను స్వీకరించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. గ్రీవెన్స్ మాడ్యూల్ పేరిట ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేయవచ్చని తెలిపింది. ఫిర్యాదుల స్వీకరణకు 92400 21456 ఫోన్ నంబర్ నిరంతరం పని చేస్తుందని వెల్లడించింది.

## చిరు వ్యాపారికి అరుదైన గౌరవం..

### న్యూఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఆహ్వానం



**టీ మీడియా, నవంబర్ 29, రామగుండం:** నగర పాలక సంస్థ పరిధిలోని అల్లూరు ప్రాంతానికి చెందిన చిరు మహిళా వ్యాపారి బాలసాని నిర్మల కు అరుదైన గౌరవం దక్కింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో జనవరి 26న అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చింది.ఈమేరకు శనివారం సాయంత్రం నగర పాలక కార్యాలయంలో అదనపు కలెక్టర్, కమిషనర్ జే. అరుణ శ్రీ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. స్వశక్తితో ఎదగాలనుకునే మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నిర్మల చిరు వ్యాపారిగా పీఎం స్వనిధి పథకంలో పేరు నమోదు చేసుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో మొదటి విడత రుణం రూ.10వేలు పొంది తన ఇంట్లో ఒక చిన్న దుకాణం ప్రారంభించింది.తన కాళ్లపై తాను నిలబడాలన్న సంకల్పంతో ప్రారంభించిన ఆమె ప్రయాణంలో సకాలంలో రుణం తీర్చి రెండవ విడత రూ.20వేలు అందుకొని అందులోనే చీరల వ్యాపారం చేపట్టింది. ఆ వ్యాపారం విజయవంతం కావడంతో మూడో విడతగా రూ.50వేలు కూడా పొంది వ్యాపారాన్ని విస్తరించింది. నగదు రహిత లావాదేవీలు నిర్వహించిన వీధి వ్యాపారులకు ప్రభుత్వం అందించిన క్యాష్ బ్యాక్ ప్రోత్సాహాన్ని కూడా సద్వినియోగం చేసుకొని అత్యధికంగా రూ.5,340 క్యాష్ బ్యాక్ సంపాదించింది.దీంతో ఆమెకు జనవరి 26న న్యూఢిల్లీలో జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తన భర్త బాలసాని రవికుమార్ గౌడ్ తో కలిసి పాల్గొనడానికి మిషన్ డైరెక్టర్, మెప్మా నుంచి ఆహ్వానం లభించింది. పారిశ్రామిక ప్రాంతంలోని మహిళలు, యువతులు సమయాన్ని వృథా చేయకుండా స్వయంకృషితో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అదనపు కలెక్టర్ అరుణ శ్రీ పేర్కొన్నారు.